ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024

పింఛన్ల పంపిణీలో అల్లూరి జిల్లా టాప్

ప్రజాశక్తి-పాడేరు: పింఛన్ల పంపిణీలో జిల్లా ప్రథమ స్థానం సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను అభినందించారు. జిల్లాలో 1,24,778 మంది లబ్దిదారులకు పింఛన్లు విడుదల కాగా 1,24,190 మందికి పంపిణీ చేసి 99.75 శాతం పంపిణీతో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మొదటి రోజైన సెప్టెంబర్ ఒకటవ తేదీ రాత్రి 11.00 గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా 93 శాతమ మంది లబ్దిదారులకు సచివాలయ సిబ్బంది అందజేశారు. నిరంతరం పర్యవేక్షించిన డిఆర్డిఎ పిడి వి. మురళిని కలెక్టర్ అభినందించారు. గత నెలలో కూడా జిల్లా మొదటి స్థానం సాధించిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తిని ప్రతి నెలా కొనసాగించి జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలని సంబంధిత సిబ్బందిని, అధికారులను కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. ఇదే విధంగా ముందుకు సాగాలని పలుశాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు.

గొప్ప పోరాట యోధుడు.. సీతారాం ఏచూరి

- పోలవరం నిర్వాసితుల పక్షాన పోరాడిన ధీశాలి
- సంస్మరణ సభలో పలువురు వక్తలు

సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, పలు పార్టీల నాయకులు

ప్రజాశక్తి - కూనవరం, చింతూరు, విఆర్.పురం విలేకరులు

గొప్ప పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. పోలవరం నిర్వాసితుల పక్షాన కడవరకూ పోరాడిన ధీశాలి అని అభివర్ణించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ కూనవరం మండలంలోని టేకులబోరులో ఉన్న భాస్కర ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. పలు పార్టీల నాయకులు హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన ఏచూరి సంస్మరణ సభ కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏచూరి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎనలేని పోరాటాలు నడిపారన్నారు. బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయాలు, అభ్యుదయ భావాలు ఎంతో గొప్పవన్నారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం రావడంలో ప్రముఖపాత్ర వహించారని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న వైఖరులను ధైర్యంగా ఎదుర్కొని ఇండియా బ్లాక్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. దేశంలో బిజెపిని బలహీనపరిచి కమ్యూనిస్టు పోరాటం అంటే ఏమిటో అర్థమయ్యేలా చేసిన మహోన్నత వ్యక్తి అని చెప్పారు. మతోన్మాద బిజెపితో దేశానికి ప్రమాదం ఎలా పొంచి ఉందో అందరికీ తెలియజేశారన్నారు. పిసిసి సభ్యులు ఎమ్‌డి హబీబ్ మాట్లాడుతూ అభ్యుదయ భావాలు, విప్లవ పోరాటాల కలబోత ఏచూరి అని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ తరుపున విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన పిదప అంచెలంచెలుగా ఆయన ఎదిగారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేపట్టారన్నారు. టిడిపి నాయకులు ఎడవల్లి భాస్కర్ మాట్లాడుతూ ఏచూరి వంటి గొప్ప కమ్యూనిస్టు ప్రపంచానికే ఆదర్శమన్నారు. వైసిపి నాయకులు మరియదాసు మాట్లాడుతూ ఏచూరి దేశానికి దిక్సూచి అని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుజ్జా మోహన్‌రావు, జనసేన నాయకులు సాంబశివ, స్వచ్ఛంద సేవకులు గాంధీ బాబు, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, పూనం సత్యనారాయణ, పాయం సీతారామయ్య, ఐ.వెంకటేశ్వర్లు, సీసం సురేష్, పల్లపు వెంకట్, సోయం చిన్నబాబు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, నాగమణి, రామారావు, శంకర్, విలీన మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సంస్మరణ సభకు హాజరైన ప్రజానీకం

రోధిస్తున్న బంధువులు

చికిత్స పొందుతూ బిడ్డ.. ఆసుపత్రికి తరలిస్తుండగా తల్లి.. మృత్యువాత

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గర్భిణీకి జన్మించిన శిశువు బుధవారం మృతి చెందింది. పరిస్థితి విషమించి తల్లి మృతి చెందింది. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ తుంబవలస గ్రామానికి చెందిన గెమ్మెలి చిట్టమ్మ పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో జన్మనిచ్చిన మగ బిడ్డ కొద్ది గంటల్లో చికిత్స పొందుతూ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి చిట్టమ్మకు ఆరోగ్యం విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో శృంగవరపుకోట సమీపంలో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుదేహాన్ని గురువారం స్వగ్రామమైన తుంబవలసలో ప్రైవేటు వాహనంలో తీసుకొచ్చినట్లు తెలిపారు.

మెరుగైన వైద్యం అందక మరణాలు : సిపిఎం

అరకులోయ ఏరియా ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేక మెరుగైన వైద్యం అందక శిశువులు, బాలింతల మరణాలు రోజు రోజురోజు కు పెరుగుతున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కిండంగి రామారావు తెలిపారు. గురువారం అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పర్యటించిన ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గిరిజన ప్రాంతంలో గర్భిణీలకు పౌష్టికాహారం లోపం వలన రక్తహీనతతో ఇబ్బంది పడుతూ చనిపోతున్నారన్నారు. పసిబిడ్డలకు మెరుగైన వైద్యం అందక శిశువు మరణాలు అధికంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. మరణాలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంపిడిఒగా లవరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -అరకులోయరూరల్: మండల ఎంపిడిఓగా ఎ.లవరాజు గురువారం బాధ్యతల స్వీకరించారు. ఆనందపురం మండలంలో ఎంపీడీఓగా నిధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీ పై అరకులోయ ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ సిహెచ్ వెంకటేష్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతల స్వీకరించిన ఎంపీడీవో మాట్లాడుతూ, .మండలంలో అన్ని గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా పని చేస్తానని పేర్కొన్నారు.

14లోగా అభివృద్ధి నివేదికలు సమర్పించాలి

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం

మాట్లాడుతున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సింహాచలం

ప్రజాశక్తి- రంపచోడవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను సిద్ధం చేసి,, ఈనెల 14లోగా సమర్పించాలని వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులను రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. గురువారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఏడు మండలాల ఎంపిడిఒలు, ఉపాధి ఎపిడి, ఎపిఒలు,గిరిజన సంక్షేమం, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు, అన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల పరిధిలో మారుమూల గ్రామాల లింక్ రోడ్లు, జన్‌మన్ పథకం ద్వారా పివిటిజిలకు మంజూరైన గృహాలు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జన్‌మన్ పథకంలో ఎన్ని పివిటిజి కుటుంబాలకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశారో ఆరా తీశారు. మారుమూల గ్రామాలకు ఎన్ని లింక్ రోడ్లను గుర్తించిందీ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. గిరిజనులకు అవసరమైన ప్రభుత్వ భవనాలను గుర్తించాలన్నారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా కొత్త చెక్ డ్యాములు, ఉన్నవాటి మరమ్మతులకు ఎన్నింటిని గుర్తించారో ఆరా తీశారు. ఏజెన్సీలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కొత్తరోడ్లు, లింకు రోడ్లు ఎన్నింటిని గుర్తించారో మండలాల వారీగా వివరాలపై ప్రశ్నించారు. సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండలాల వారీగా మంజూరైన ఇళ్లు, వాటి పురోగతిపై ప్రశ్నించారు. వీటన్నింటికీ సంబంధించి మండలాలు, శాఖల వారీగా ప్రగతి నివేదికలను ఈనెల 14లోగా సమర్పించాలని ఆదేశించారు. వివిధ విభాగాల ఇంజినీర్లంతా వాట్సాప్‌లో ఒక గ్రూపుగా ఏర్పడాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎపిడి డిఎన్‌వి రమణ, మొబైల్ మెజిస్ట్రేట్ జాన్‌రాజ్, ఉపాధి ఎపిడి జి. శ్రీనివాసరావు, పిఎఒ ఎల్.రాంబాబు, ఇఇలు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, ఎంపిడిఒలు వీర కిషోర్, హరికృష్ణ, మడకం బాపన్న దొర, యాదగిరి ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి జాన్ మిల్టన్, డిఇఇలు చైతన్య, గౌతమి, సాయి సతీష్, రామచంద్ర మూర్తి, శ్రీనివాసరావు, స్వామి, శివ, ఉపాధి ఎపిఒలు సత్యనారాయణ,ప్రకాష్, సురేష్, అరవాలు, సాయిబాబా, రెడ్డి బాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి, సర్పంచ్, సిపిఎం నేతలు.

ప్రజాశక్తి-విఆర్.పురం: వరదల్లో నష్టపోయిన, ఉపాధి కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం జిల్లా నాయకలు పూనం. సత్యనారాయణ కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ సుబ్బారావును కలిసి వినతిపత్రం అందజేశారు. రేఖపల్లి గ్రామ పంచాయతీ గొల్ల గుంపు, శుద్ధ గూడెం, రేఖపల్లి, గ్రామాల గిరిజన కుటుంబాలకు జీవన భృతి కల్పించాలని కోరారు. వరదలు, వర్షాలతో నెల రోజులు ఎటువంటి పనులు లేక అవస్తలు పడ్డ బాధిత గ్రామాల పేదలకు రూ.4800 జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు.దీనిపై తహసీల్దార్ సుబ్బారావు స్పందిస్తూ, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, కారం. సుందరయ్య, కె. సత్యనారాయణ, సూరిబాబు పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-దేవీపట్నం : 16నెలల వేతన బకాయి, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలం సత్యసాయి తాగునీటి సరఫరా పథకం మెయింటినెన్స్ వర్కర్స్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ కార్యాలయం ఎదుటు గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. 16 నెలల వేతనబకాయి చెల్లించాలని 20 రోజుల క్రితం రెండు రోజులు ధర్నా నిర్వహించగా, ఎటువంటి స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగామని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టమూరి వీరబాబు తెలిపారు. కార్మికుల సమ్మెతో మండలంలో పలు గ్రామాలకు ఈ పథకం ద్వారా గోదావరి తాగునీటి సరఫరా నిలిచిపోనుంది.

ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ యు.ఇసాక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 16 నెలల జీతాలు, రెండేళ్లుగా చెల్లించాల్సిన ఇఎస్ఐ, పిఎఫ్‌లను చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే నూతన కాంట్రాక్టర్ టివివి సత్యనారాయణ వచ్చిన తర్వాత వేతనాలను మునుపటిలా బ్యాంక్ ఖాతాలో కాకుండా చేతికి సొమ్ములు ఇస్తున్నారని, పాత పద్ధతిలోనే ఆన్‌లైన్‌లో అకౌంట్లకు జమ చేయాలని కోరారు. కార్మికుల సమ్మెకు సిఐటి ^ు నాయకులు పూర్ణిమ రాజు సంఘీభావం తెలపగా, , యూనియన్ నాయకులు ఐ శ్రీనివాసులు, కె.మల్లేశ్వరరావు, పి శ్రీనివాస్, జె సురేష్, కె.రామకృష్ణ సత్యసాయి ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న సత్యసాయి నీటిపథకం కార్మికులు

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

-జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర- ఘనంగా ఏకలవ్య కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి- అరకులోయ: విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన విద్య అభ్యసించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. అరకులోయ మండలం ఎండపల్లి వలసలోని ఏకలవ్య ఈ ఎం ఆర్ ఎస్ లో గురువారం ఏకలవ్య 5వ స్టేట్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుభద్ర మాట్లాడుతూ, ఏకలవ్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న ఉద్దేశంతో ప్రతి విద్యార్థినికి సంవత్సరానికి సుమారు లక్ష తొమ్మిది వేల రూపాయలు ఖర్చు చేస్తుందని ఆమె అన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె అన్నారు. గురువులను గౌరవించే పద్ధతి విదిగా అలవర్చుకోవాలని ఆమె సూచించారు. కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు, మర్రి కామయ్య, మల్లు దొర, గంటన్న దొర వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

అరకు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, ఏకలవ్య పాఠశాలలో చదువుకోవడంతో విద్యాభివృద్ధితో పాటు ఇంగ్లీష్ భాషలలో కూడా పట్టు సాధించవచ్చని ఆయన అన్నారు. దీంతో ఎటువంటి పోటీ పరీక్షల్లో కూడా గిరిజన విద్యార్థులు తట్టుకునే వీలుంటుందని ఎక్కడికి వెళ్లినా భాష సమస్య తల ఎత్తదని ఆయన అన్నారు.

గురుకుల జాయింట్ సెక్రటరీ రమణమూర్తి మాట్లాడుతూ,రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 800 మంది విద్యార్థిని విద్యార్థులు 36 ఈవెంట్స్ కల్చరల్ ప్రోగ్రామ్ లో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు నేషనల్ లెవెల్ ఈవెంట్స్ లో పాల్గొంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు పాడేరు ఐటిడిఏ గురుకుల కోఆర్డినేటర్ పి ఎస్ ఎన్ మూర్తి, అరకులోయ ఏటిడబ్ల్యు మల్లికార్జున రావు, అరకులో జెడ్పిటిసి సభ్యురాలు శెట్టి రోషిని, అరకు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సియారి దొన్ను దొర, పెదలబుడు, పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచులు పెట్టేలి బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

రేకుల షెడ్ల తొలగింపుపై ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని లగిసిపల్లి కస్తూర్బా గాంధీ సమీపంలో గిరిజన విలేకరులు నిర్మించిన రేకు షెడ్లను తొలగించిన సర్పంచ్ లక్కే పార్వతమ్మ పైన కేసు నమోదు చేయాలని తహశీల్దార్, పోలీస్ శాఖ కు ఆదివాసి గిరిజన విలేకర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, దీర్ఘకాలికంగా పనిచేస్తున్న విలేకరులను ప్రభుత్వాలు గుర్తించి ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయాలని వారు అన్నారు.ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న విలేకరుల పైన దాడికి పాల్పడడం దుర్మార్గ చర్యని వారు ఖండించారు. విలేకరులకు ఏర్పాటు చేసిన స్థలంలో రేకు షెడ్లను వేసుకుంటే అక్రమంగా ధ్వంసం చేస్తూ తొలగించడం సరికాదన్నారు. వెంటనే సర్పంచ్ లక్కే పార్వతమ్మ పైన ఎఫ్ఆర్ఐ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సర్పంచ్ పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన విలేకరుల సంఘం అధ్యక్షులు కే.ఆనంద్, ఉపాధ్యక్షులు ఎం.నాగరాజు, గౌరవ అధ్యక్షులు కే గణేష్, కోశాధికారి ఎల్ పండు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - చింతపల్లి : గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని అప్పుడే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం అవుతుందని కిటుముల సర్పంచ్ గేమ్మెల రమణమ్మ అన్నారు. ఆ పంచాయతీ సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు వనము పద్మతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ సభల ద్వారా వచ్చిన ఫిర్యాదులను తప్పనిసరిగా స్వీకరించి ఆ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గ్రామ సభల సమయంలో అన్ని శాఖల అధి కారులు అందుబాటులో ఉండాలన్నారు.

ఎంపీటీసీ పద్మ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం వీడనాలన్నారు. గ్రామ సభలకు హాజరుకాని ఉద్యోగులపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు గడుతూరి రాధాకృష్ణ, కార్యదర్శి బాలు, ఉపాధి హామీ పథకం, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ రమణమ్మ

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్

నేటి నుంచి విశాఖలో 'ఐబిడి' సదస్సు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : బ్రిక్స్ ఐబిడి 'ఇన్ఫమేటరీ బౌల్ డిసీజ్' (ఐబిడి) సదస్సును విశాఖ నోవాటెల్ హోటల్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆంధ్రా మెడికల్ కళాశాల గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి, సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ తెలిపారు. గురువారం కెజిహెచ్ అంకానా హాల్‌లో కిమ్స్ వైద్యులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్ చలపతిరావుతో కలిసి మీడియా సమావేశంలో సదస్సు వివరాలు వెల్లడించారు.

సిసిఎఫ్ ఇండియా సహకారంతో బ్రిక్స్ దేశాల ఐబిడి కన్సార్టియంను 8వ జాతీయ సదస్సుగా నిర్వహించనున్నామన్నారు. అత్యంత విషమమైన ఇన్ఫమేటరీ బౌల్ డిసీజ్ (పేగు పోత జబ్బు)పై సదస్సులో పాల్గొనే నిపుణులు విపులంగా చర్చించడంతోపాటు, తమ పరిశోధనల్ని వివరిస్తారన్నారు. పేగు పోత వ్యాధిపై పరిశోధన పురోగతి, ఈ వ్యాధి తీవ్రత అంశాలపై లోతైన అవగాహనకు సదస్సులో నిష్ణాతులైన వైద్యులు పలుసూచనలు చేస్తారన్నారు. ఐబిడి రంగంలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు యుఎస్ఎ, యుకె, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, నేపాల్, జింబాబ్వే వంటి దేశాల ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు హాజరుకానున్నారని తెలిపారు. పెద్ద ప్రేగులో సోకే ఈ వ్యాధి తీవ్రమైనదని, మధుమేహ వ్యాధి వలే రోగి జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుందన్నారు. దేశంలో ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తించలేదని, క్షయవ్యాధిగా భావించి వైద్యం అందించే వారన్నారు. దేశంలో ఒకప్పుడు పేగు పోత జబ్బు అంతగా ఉండేది కాదని, అయితే మారుతున్న ఆహార అలవాట్లు వల్ల ఇది దేశంలో ప్రవేశించి,ఇప్పుడిప్పుడే తీవ్రస్థాయికి చేరుకుంటోందన్నారు. నీళ్ల విరోచనాలు, రక్తం రావడం, బరువు తగ్గడం ఈ వ్యాధి లక్షణాలన్నారు.

కిమ్స్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, సదస్సు నిర్వహణ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఆచంట చలపతిరావు మాట్లాడుతూ, ఐబిడి అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది జీర్ణశయాంతర పరిస్థితిని ప్రభావితం చేస్తుందన్నారు. భారతదేశంలో పెరుగుతున్న కేసులు, రోగుల ఫలితాలను మెరుగుపరచడానికి, మెరుగైన నిర్వహణ కోసం, కొత్త రోగ నిర్ధారణ, చికిత్సా వ్యూహాలను ఈ సదస్సులో లోతుగా చర్చిస్తారన్నారు. ఈ వ్యాధిని సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన వినూత్న చికిత్సలు, రోగి కేంద్రీకృత సంరక్షణ, మల్టీ డిసిప్లినరీ విధానాలను సదస్సు అన్వేషిస్తుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సుమారు 600 మంది ప్రతినిధులు, ఆంధ్ర మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు 100 మంది హాజరవుతారన్నారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ అధినేత డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు.

బోధనలో నూతన విధానాలు అవసరం

ప్రజాశక్తి-విశాఖపట్నం : బోధనలో నూతన విధానాలను అవలంభిస్తూ, ఆసక్తిదాయకంగా బోధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం సెనెట్ మందిరంలో ఆర్ట్స్ కళాశాల విభాగాల గెస్ట్ ఫ్యాకల్టీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ సహచరులతో, విభాగాధిపతులతో సమన్వయం చేసుకుంటూ వెళ్లాలన్నారు. ప్రస్తుతం అందిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ రుసుమును పెంపుదల చేసే దిశగా కృషిచేస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తి రెండు శాస్త్రాలలో లోతైన అవగాహన పెంచుకోవాలన్నారు. త్వరలో ఏయూలో డబల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, బోధనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనిచేయాలని సూచించారు.

సహజ సిద్ధ సాగుతో అధిక దిగుబడులు

పొలం పిలుస్తుందిలో వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

చింతపల్లి: సహజ సిద్ధమైన జీవామృతాలతో సాగు చేపడితే అధిక ఉత్పత్తి రావడమే కాకుండా ఆశాజనకమైన గిట్టుబాటు ధర వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కే జాహ్నవి తెలిపారు. మండలంలోని అంతర్ల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అంతర్ల గ్రామ రైతులకు అవగాహనా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ, తుపాను కారణంగా ఎడతెరిపి లేని వర్షాలు కురిసి పంటలు దెబ్బతిన్నప్పటికీ, ఉన్న పంటలను కాపాడుకునే దిశగా రైతులు సహజ సిద్ధమైన జీవామృతాలను సొంతంగా తయారు చేసుకుని పిచికారి చేసుకోవాలన్నారు. దీంతో పంటల పై చీడ పీడలు లేకుండా బలంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, చింతపల్లి డివిజన్ ఇంచార్జ్ వెంకట్, మండల ఇంచార్జ్ కొర్ర మోహన్, ఎర్రబొమ్మల యూనిట్ ఇంచార్జ్ సుభద్ర, యూనిట్ ఐ సి ఆర్ పి లు జి బొజ్జిపాడల్ , జి పద్మ, కె రాజేశ్వరి, డి నీలామత, కె సోమరాజు , వీ హెచ్ ఏ చేతన్ వర్మ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

అనంతగిరి: మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి మేట్టపాలేం గ్రామం వద్ద గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారిని ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ జన్ని. సన్యాసిరావు మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం పరుచుకోవాలని ఆయన సూచించారు. పవర్ టిల్లర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ కింద ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పంట పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చెరుకుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ రమేష్ నాయుడు మాట్లాడుతూ, కోతుల బాధ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా ఎరువులు వాడకం ఉండాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, జీవన, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలని సూచించారు. ఇ-పంట నమోదుపై చర్చించారు. పంట రుణాలు, పంటల బీమా, పెట్టుబడి సాయంపై వివరించారు. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పైపులు మంజూరుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి నాగేశ్వరరావు, పశు వైద్యాధికారి తరుణ్, వ్యవసాయ పశు సంవర్ధక శాఖ సిబ్బంది కోటేశ్వరరావు, సుబ్బరాజు పాల్గొన్నారు.

వైద్యాధికారి, హెచ్‌ఎం, టీచర్లకు అవార్డుల ప్రదానం

అవార్డులతో హెచ్‌ఎం, టీచర్లు, వైద్యాధికారి

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ మండలం రవ్వలగూడ గిరిజన సంక్షేమ శాఖ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్.పీ కెందుకి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవా అవార్డు లభించింది. చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యూఎస్ఏ/ ఇండియా) హెచ్‌ఎం కింద చేపట్టిన అనేక సామాజిక కార్యక్రమాలను గుర్తించిన చేయూత ఆర్గనైజేషన్ ఈ అవార్డును అందించింది. విద్యార్థులకు క్రమశిక్షణ మార్గంలో నడిపించడమే కాకుండా, పాఠశాల ప్రాంగణం ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, ఇతర సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొనడంతో కెందు అనేకమార్లు ఉన్నత అధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవలను గుర్తించి సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డును ఇచ్చి సన్మానం చేశారు.

గన్నెల పిహెచ్‌సి వైద్యులు సిహెచ్ కమలకుమారికి మదర్ తెరిసా సేవ అవార్డు ఇచ్చి సన్మానించారు. రవల కూడా పాఠశాలలోనే స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధి పాకి నారాయణకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ హెడ్ అమోస్ జేమ్స్, చేయూత ఆర్గనైజేషన్ ఫౌండర్ డాక్టర్ వైఎస్ చిన్నారావు, ఏపీఎస్ ఛైర్మన్ చట్టు మోహన్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి చిన్ని పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ఆదివాసీ పివిటీజి కుటుంబాలకు అందిస్తున్న సామాజిక సేవలను గుర్తించి మదర్ థెరిస్సా సేవ రత్న నేషనల్ అవార్డును అరకులోయ మండలం మాడగడ గ్రామానికి చెందిన వంతాల డేవిడ్‌ను అందించారు. మండల కేంద్రంలోని ఏపీ టూరిజం హరిత రిసార్ట్స్ జరిగిన కార్యక్రమంలో అవార్డును స్వీకరించారు.ఈ అవార్డును చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ వైయస్ చిన్నారావు, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఎం ఆమోస్ జేమ్స్ చేతుల మీదుగా అవార్డ్స్ బహుకరించారు.

అనంతగిరి: ఉపాధ్యాయ రంగంతో పాటు సోషల్ సర్వీస్‌ను గుర్తించి ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు కు జాతీయ అవార్డు లభించింది. అరకు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో మదర్ తెరిసా సేవ రత్న జాతీయ అవార్డును కొండిభ పంచాయతీ నడిమివలస ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు కు అంజేశారు. చేయూత ఆర్గనైజేషన్ ఫౌండేషన్ ప్రతినిధి వైఎస్ చిన్నరావు, సుప్రీంకోర్టు సతీష్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేశారు.

నేరాలు ఘోరాలు

పట్టుబడ్డ నిందితులు

455 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని సీతగుంట పంచాయతి రోగుల పేట జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం 455 కేజీల గంజాయిని ముందస్తు సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నట్లు జి మాడుగుల. సర్కిల్ ఇన్స్పెక్టర్ శిహెచ్ వెంకటరావు గురువారం విలేకరులకు తెలిపారు. గంజాయి తరలిస్తుండగా అనుమానంతో సిబ్బంది బైక్‌లను ఆపి గంజాయిని పట్టుకున్నామన్నారు. ఏడుగురిలో నలుగురు తప్పించుకొని పరరయ్యారన్నారు. మొబైల్ ఫోన్లు, నగదు స్వాధీన పరచుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ములగాడ : భార్యాభర్తల గొడవ కారణంగా భర్త మనస్తాపం చెంది గురువారం ఉదయం రోడ్డు మీదకు వచ్చి పక్కనే ఉన్న చెట్టుకు ఉరి పోసుకొని ఆత్మచేసుకున్నాడు. జివిఎంసి 61వ వార్డు వెంకన్నపాలెంలో నివాసముంటున్న పిల్లి సన్యాసిరావు స్థానికంగా చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా సన్యాసిరావు భార్యతో వివాదం పడుతూనే ఉన్నాడు. దీంతో బుధవారం రాత్రి ఇంట్లోంచి వచ్చేసిన సన్యాసిరావు మనస్థాపానికి గురై గురువారం ఉదయాన్నే హెచ్‌పిసిఎల్ గోడకు ఆనుకొని ఉన్న చెట్టు పైకి ఎక్కి ఉరివేసుకుని ఆత్మ చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మల్కాపురం సిఐ విద్యాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలి

-రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం : పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలని, తద్వారా యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు అన్నారు. గురువారం వరల్డ్ నేచర్ డేను పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఇడి, ఎంఇడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్ ఉపాధ్యాయులగా నిలిచే మీరంతా పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కల ఆవశ్యకత, పర్యావరణం ప్రాధాన్యత తెలియజేయాలన్నారు. మొక్కలు నాటి, పెంచే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. వృక్షాలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందనే వాస్తవాన్ని వారికి వివరించాలన్నారు. వివిధ వేడుకల్లో మొక్కలనే బహూకరించే సంప్రదాయాన్ని అవలంభించాలని సూచించారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మూర్తి, డాక్టర్ వినీల కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా విజేతలకు అభినందన

ప్రజాశక్తి-విశాఖపట్నం : రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన వివిధ యోగా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో యోగా విద్యార్థి ఎం.నవీన్‌కుమార్ మూడవ స్థానాన్ని, రాష్ట్ర స్థాయిలో బి.యామిని ప్రథమ స్థానాన్ని, సిహెచ్ శిరీష ద్వితీయ స్థానాన్ని, బి.పవన్ మూడవ స్థానాన్ని సాధించారు. జిల్లా స్థాయిలో వి.నరేంద్రబాబు ప్రథమ స్థానాన్ని సాధించారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రమేష్ నాయుడు

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పంట పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చెరుకుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ రమేష్ నాయుడు మాట్లాడుతూ, కోతుల బాధ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా ఎరువులు వాడకం ఉండాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, జీవన, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలని సూచించారు. ఇ-పంట నమోదుపై చర్చించారు. పంట రుణాలు, పంటల బీమా, పెట్టుబడి సాయంపై వివరించారు. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పైపులు మంజూరుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి నాగేశ్వరరావు, పశు వైద్యాధికారి తరుణ్, వ్యవసాయ పశుసంవర్ధక శాఖ సిబ్బంది కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలంలోని రేఖపల్లి ఎఎస్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో యూత్ కమ్యూనిటీ లీడర్స్‌కు ప్రభుత్వ పథకాలపై అవగాహనకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తు, అప్‌డేషన్‌పై వివరించారు. రామగోపాల్ రావు గారు ఆధార్, రేషన్‌కార్డుల ప్రాముఖ్యత, భూవివరాల మ్యుటేషన్, ఉపాధి హామీ పథకం, జనన, మరణ ధ్రువీకరణలను పొందడం, ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎపిఒ చిరంజీవిరావు మాట్లాడుతూ జాబ్‌కార్డ్ ద్వారా పనులు, పనికి దరఖాస్తు చేసుకునే విధానం వివరించారు. కార్యక్రమంలో ఎఎస్‌డిఎస్ ప్రోగ్రాం మేనేజర్ సాయి చైతన్య, ఎన్ఎఫ్ పుట్టి మీనా, కోఆర్డినేటర్ పులి శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణలో40 గ్రామాల నుండి 80 మంది ఆదివాసీ యువత పాల్గొన్నారు.

సీలేరు రోడ్డు అభివృద్ధి ప్రతిపాదనలపై హర్షం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి నుంచి సీలేరు వరకు రహదారి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి రూ.46 కోట్లు అంచనాతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకటన చేయడంపె వివిధ రాజకీయపార్టీల నాయకులు, గిరిజన సంఘ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారి ప్రాధాన్యత దృష్టిలో ఉంచుకొని, దీని అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని గిరిజన సంక్షేమశాఖమంత్రి ఇప్పటికే హామీ ఇచ్చి, ఈ మేరకు అంచనా ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌కు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు.

దిబ్రూగఢ్ - హుబ్లి మధ్య వన్ వే స్పెషల్ ట్రైన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించే క్రమంలో దిబ్రూగఢ్ - హుబ్లి మధ్య వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 05926 దిబ్రూగఢ్- హుబ్లి వన్ వే స్పెషల్ ట్రైన్ అక్టోబర్ 5 శనివారం మధ్యాహ్నం 13:30 గంటలకు దిబ్రూగఢ్ నుంచి బయలుదేరి మూడో రోజు (సోమవారం) మధ్యాహ్నం 15:08 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15:10 గంటలకు బయలుదేరి, నాలుగో రోజు మంగళవారం ఉదయం 9:00 గంటలకు హుబ్లి చేరుకుంటుంది. ఈ రైలు వాల్తేరు డివిజన్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలస, దువ్వాడల్లో ఆగుతుందని అధికారులు తెలిపారు.

రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 90 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాలు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల వారీగా చేపట్టిన చర్యలపై సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో కలిపి రోజుకు 700 స్టేజ్ కన్వర్షన్ జరగాలని, 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, గుత్తేదార్లను అప్రమత్తం చేస్తూ పనుల్లో జోరు పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకెళ్లాలని, మరింత పురోగతి సాధించాలని సూచించారు. లేఅవుట్ల వారీగా సాంకేతిక సమస్యలను అధిగమించాలని, జియో ట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎమినిటీస్ సెక్రటరీలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా స్థాయి అధికారులకు చెప్పారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఇఇ రమణ మూర్తి, డిఇలు, మండల ప్రత్యేక అధికారులు, ఎఇలు పాల్గొన్నారు.

నేటి నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సైకియాట్రిక్ సొసైటీ, గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ కేర్ సంయుక్తంగా మానసిక ఆరోగ్య వారోత్సవాలను అక్టోబర్ 4 నుండి 10 వరకు ప్రభుత్వ మానసిక వైద్య శాల వేదికగా నిర్వహించనున్నాయని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్య శాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం అక్టోబర్ 10ని పురస్కరించుకుని దానికి ముందు ఏడు రోజులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. 'ఇప్పుడు పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం వచ్చింది' నినాదంతో ఈ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

విశాఖ సైకియాట్రిక్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.విజయలక్ష్మి, మాట్లాడుతూ 4వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమం, 5న పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ క్విజ్, 7న విద్యార్థుల్లో ఒత్తిడి నివారణ, 8న రోగుల సంరక్షకులు, పారా మెడికల్ సిబ్బందికి మానసిక ఆరోగ్య చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10వ తేదీన జిల్లా న్యాయ సేవల కార్యక్రమం ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

5న మురళీ మోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అక్కినేని శత జయంతోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 5వ తేదీన ప్రముఖ సినీ నటుడు, మాజీ ఎంపీ ఎం.మురళీ మోహన్‌కు డాక్టర్ అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కన్వీనర్ కె.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం ఎంవిపి.కాలనీలోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తన క్యాంపు కార్యాలయంలో పురస్కార వేడుక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యూ రోషన్ లాల్ ఆర్కెస్ట్రా అధినేత, ప్రోగ్రాం కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 5న సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అక్కినేని నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగానూ, మాజీ రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, మాజీ మంత్రి దాడి వీర భద్రరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు గౌరవ అతిథులుగానూ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షులు సత్యనారాయణ, కళాంజలి సభ్యులు కెఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

బూసి వెంకటస్వామికి కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామిని 2024 సంవత్సరానికిగాను డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఎస్‌పిఎల్‌టిఒ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిలో తనను ఎంపిక చేయటం ఆనందంగా ఉందని, తెలుగు భాష, సాహిత్యాలలో కృషి చేస్తున్నందుకుగాను ఈ సత్కారం అందుకోన్నానని వెంకటస్వామి మీడియాకు తెలియజేశారు. ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, 15వ తేదీన భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ కింగ్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్‌ల జయంతులను పురస్కరించుకుని 20వ తేదీన గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. డాక్టర్ బూసి వెంకటస్వామి ఇప్పటికే దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా స్మారక పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం పొంది ఉన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపు నోటిఫికేషన్ జారీ చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మద్యం పాలసీలో భాగంగా కల్లు గీత కార్మిక కులాలకు 10 శాతం దుకాణాల కేటాయింపు నిర్ణయంపై ఆయా సంఘాల ఉప కులాలన్నీ హర్షం వ్యక్తం చేస్తూనే తక్షణం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరాయి. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్‌లో శెట్టిబలిజ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు గుత్తుల మధుసూదన్ తదితరుల ఆధ్వర్యంలో నేతలంతా సమావేశమయ్యారు. సిఎం చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎపిలో సుమారు 3336 దుకాణాలను జనరల్ కేటగిరీలో ఉంచి, అదనంగా 10 శాతం దుకాణాల సంఖ్య పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని, అయితే ఈ పెంచిన 10 శాతానికి సంబంధించి త్వరగా నోటిఫికేషన్ ఇవ్వనందున గీత కులాలకు వారు నష్టపోతున్నారని తెలిపారు. 3336 దుకాణాలకు సంబంధించి నోటిఫికేషన్‌తోపాటు, 10 శాతం గీత కులాలకు ఇచ్చిన షాపులకు కూడా త్వరగా నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి జయరాం, గీత కార్మిక ఉప కులాల మాజీ యూత్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి రాధను సత్కరిస్తున్న నాయకులు

బదిలీ కార్యదర్శులకు సత్కారం

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని నల్లగొండ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి, అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలానికి బదిలీపై వెళుతున్న సత్య గౌరిని గురువారం ఘనంగా సత్కరించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జంపా రాజకుమారి, ఎంపిటిసి ఇరవాడ సత్యవేణి, యూనిట్ ఇన్‌చార్జి లోతా సింహాచలం, గ్రామ పెద్దలు ఇరవాడ దేవుడు, పల్లి అప్పారావు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం ఏ. దారకొండ పంచాయతీ కార్యదర్శి రాధ సేవలు మరువ రానివని గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు కొనియాడారు. గొలుగొండ మండలానికి బదిలీ అయిన రాధకు బదిలీ వీడ్కోలు సభ నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు అంకితభావంతో కార్యదర్శి రాధ సేవలు అందించారని, వర్షాలు వచ్చినా వాగులు దాటుకుంటూ ఐదేళ్లపాటు రెగ్యులర్‌గా వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశారన్నారు.కార్యక్రమంలో జి. ఆనందరావు, పుజారి బాలన్న పాల్గొన్నారు.

దుర్గమ్మ వార్షికోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్‌లో దుర్గాదేవి 34వ వార్షికోత్సవాలను గురువారం ఉదయం ఎపి జెన్‌కో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఇ(సివిల్) చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వికాస్‌కుమార్ పాండే ప్రారంభించారు. అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపన చేసి, నిజరూప దర్శనం అనంతరం దుర్గాదేవికి పూలమాలలతో అలంకరించారు. వేద పండితులు బొర్ర.అనిల్ ఆధ్వర్యంలో దంపతులతో కుంకుమార్చనలు నిర్వహించారు. దేవి నవరాత్రులలో భాగంగా ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినటుల ఆలయ కమిటీ తెలిపింది.

భద్రాచలం ఆర్‌టిసి బస్సు పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు: విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసును గురువారం విశాఖ డిపో ఆర్‌టిసి అధికారులు పునరుద్ధరించారు. విశాఖపట్నంలో ఉదయం 5:30 బయలుదేరి సీలేరు మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకొని భోజన విరామం అనంతరం భద్రాచలం వెళ్లనుంది. గత నెల 8న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో లంకపాక నుంచి సీలేరు వరకు రహదారి అస్తవ్యస్తంగా తయారవ్వడంతో ఆర్‌టిసి బస్సులతో పాటు ఇతర వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో కొన్నిచోట్ల వెట్‌మేక్స్ వేసి రోలింగ్ చేయడంతో కొంతమేరకు రహదారి బాగుపడింది. ఈ నేపథ్యంలో సీలేరు రూటులో బస్సులను పునరుద్ధరించాలని 20రోజులుగా అధికారులపై ప్రజలు, రాజకీయ నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘాలు ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు ఆర్‌టిసి అధికారులు స్పందించారు. రెండు రోజుల నుంచి పాడేరు నర్సీపట్నం డిపో బస్సు సర్వీసులు పునరుద్ధరించగా, తాజాగా గురువారం నుంచి విశాఖ ఆర్‌టిసి డిపోకు చెందిన విశాఖ వయా సీలేరు భద్రాచలం బస్సు పునరుద్ధరించడంతో ప్రయాణికులకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు విశాఖ వయా చింతపల్లి మీదగా వెళ్లే సీలేరు నైట్ హాల్ట్ బస్సు సర్వీస్‌ను ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించాలని ప్రజలు వేడుకుంటున్నారు. విశాఖపట్నంలో సాయంత్రం మూడు గంటలకు బయలుదేరి చింతపల్లి మీదుగా సీలేరు రాత్రి పది గంటలకు చేరుకొని సీలేరు నైట్ హాల్ట్ ఉండి మరుసటి రోజు సీలేరులో ఉదయం 6 గంటలకు బయలుదేరి నర్సీపట్నం మీదుగా విశాఖపట్నం మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకుంటుంది. ఈ బస్సును పునరుద్ధరించాలని సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు పంచాయతీ ప్రజలు కోరారు.